## క్లుప్తంగా

### ప్రజా సంక్షేమమే ధ్యేయం

**ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

**తుర్కయంజాల్:** ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పురపాలక సంఘం పరిధి కమ్మగూడ, మన్నెగూడ, రాగన్నగూడ, తుర్కయంజాల్‌లో శనివారం ఆయన రూ.8.46 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజా కార్యక్రమంలో భక్తులు

**కడ్తాల్:** మండల పరిధి అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చనలు, ఫల పంచామృత అభిషేకములు, విశేష పూజలు, సత్యనారాయణస్వామి వ్రత పూజలు జరిపారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విజితారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సీజీఆర్ చైర్ పర్సన్ లీల, పారిశ్రామిక వేత్తలు లక్ష్మారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పాషను పరామర్శిస్తున్న జైపాల్ యాదవ్

**ఆమనగల్లు:** ఆమనగల్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ, విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాష సతీమణి షాహిన్ శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శనివారం ఆమనగల్లు పట్టణంలోని పాష నివాసానికి వెళ్లారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎద్మ సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ లింగయ్య, అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఎస్సం హాస్పిటల్స్ ఎండీ డా.హరికాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### మట్టి రోడ్డుకు మరమ్మతు



రోడ్డుకు మరమ్మతు చేయిస్తున్న నాయకులు

**యాచారం:** గుంతల మయంగా మారిన మట్టి రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు. యాచారం మండల పరిధి నక్కర్తమేడిపల్లి, కడ్తాల్ మండలం పల్లెచెల్కతండాలకు కలిపే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగి, ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో కాంగ్రెస్ పార్టీ కడ్తాల్ మండలం ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు విస్లావత్ శ్రీనునాయక్.. ప్రజా రవాణాను దృష్టిలో ఉంచుకుని, శనివారం సొంత నిధులతో మట్టిని పోయించి చదును చేయించారు. కంపచెట్లను తొలగించారు. కార్యక్రమంలో నాయకులు సీతారాం నాయక్, మోతీలాల్‌నాయక్, సిందం కృష్ణ, రవీందర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

**మహేశ్వరం:** మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో ఆదివారం ఆషాఢమాసం బోనాలను పురస్కరించుకొని నిర్వాహకులు ఆలయాలను ముస్తాబు చేశారు. ప్రధానమైన పోచమ్మ దేవాలయంతో పాటు దుర్గమాత ఆలయం, కార్గో రోడ్డు సమీపంలోని ముత్యాలమ్మ ఆలయాలకు రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా మున్సిపల్ తరఫున ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లు చేశారు.

# చెరువుకు జలకళ

- నిండుకుండలా కనువిందు చేస్తున్న 'మాసబ్'
- మరో భారీ వర్షంతో అలుగుపారే అవకాశం



మాసబ్ చెరువు

**తుర్కయంజాల్:** ప్రస్తుత వానాకాలంలో ఆశించిన మేర వర్షాలు లేక భూగర్భ జలాలు పూర్తిగా పడిపోయాయి. సాగుకు కాదుకదా.. కనీసం తాగునీటికి కనాకష్టం పరిస్థితులు నెలకొన్నాయి. కానీ తుర్కయంజాల్ మాసబ్ చెరువుకు జలకళ సంతరించుకుంది. నిండుకుండలా కనువిందు చేస్తోంది. పురపాలక పరిధిలో ఇటీవల కురిసిన వరుస వర్షాలతో చెరువు.. పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. మరో భారీ వర్షం కురిస్తే.. అలుగు పారే అవకాశం ఉంది. 50 ఏళ్ల చరిత్రలో 2020 అక్టోబర్ నెలలో వరుణుడి ప్రతాపానికి చెరువు నిండి అలుగు పారిన విషయం తెలిసిందే. ఆ తరువాత కాలంలో వరుసగా సమృద్ధిగా వానలు పడుతుండటంతో అలుగు పోసింది. ఈ సారి ఇప్పటి వరకు చెరువుకు పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకుంది.

**ముంపుముప్పు**

మాసబ్ చెరువులో నీటిమట్టం పెరిగితే.. వాగు ద్వారా కింద ఉన్న ఇంజాపూర్‌లోని దిలావర్ ఖాన్ చెరువులోకి నీరు చేరుతుంది. దీంతో దిగువ కాలనీలకు ముంపు ముప్పు పొంచి ఉంది. ముఖ్యంగా ఆపిల్ అవెన్యూ కాలనీ జలమయం కానుంది. ఈ వెంచర్‌లోని కొన్ని అపార్ట్‌మెంట్లు, ఇళ్లు ఏటా నీట మునుగుతుంటాయి. దీనికి తోడు వాగు ఉగ్రరూపం దాలిస్తే.. కాలనీల రాకపోకలకు ఆటంకం తప్పదు. ఇందిరమ్మ కాలనీకి అదే పరిస్థితి. చెరువు పై భాగంలోని ఆదిత్యానగర్ కాలనీది అదే దుస్థితి. ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాసబ్ చెరువు, దిలావర్‌ఖాన్ చెరువు నాలాలను పరిశీలించారు. నాలాపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని ప్రకటించారు.

**బ్రిడ్జి నిర్మాణం చేపడితే..**

మాసబ్ చెరువు నుంచి దిలావర్‌ఖాన్ చెరువుకు వెళ్లే నీరు.. ఇంజాపూర్ నుంచి తొర్రూర్ వెళ్లే దారిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద రోడ్డు పై నుంచి ప్రవహిస్తుంటుంది. ఆ సమయంలో ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. 2020లో వాగు వరద ఉధృతికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు జలమయం అయ్యారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం చేపడితే బాగుంటుందని ప్రాంత ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. మునగనూర్ నుంచి హయత్‌నగర్‌కు వెళ్లే దారిలో గతంలో చాలా ఇబ్బందులు ఉండేవి. అక్కడ వంతెన నిర్మాణం పూర్తి కావడంతో సమస్య తీరింది.

# మాట నిలుపుకొన్న ప్రభుత్వం



యాచారం: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

- రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు
- సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

**యాచారం:** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ.. మంత్రి మండలి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని అధికార పార్టీ శ్రేణులు అన్నారు. కేబినెట్ నిర్ణయంతో శనివారం యాచారంలోని సాగర్ రోడ్డుపై అంబేడ్కర్ కూడలిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు అరవింద్‌నాయక్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

**బీసీల సంక్షేమానికి నాంది**

**ఆమనగల్లు:** రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన చేయడంతో పాటు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని ముదిరాజ్ సంఘం తలకొండపల్లి మండల మాజీ అధ్యక్షుడు యాదగిరి ముదిరాజ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ల పెంపు బీసీల సంక్షేమానికి నాంది అని, వారు అన్ని రకాలుగా ఎదగడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని బీసీలు స్వాగతిస్తున్నారని చెప్పారు.

**మంచాలలో..**

**మంచాల:** బీసీల రిజర్వేషన్లు పెంచుతూ మంత్రి మండలి తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదని కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ల విషయంలో బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా అనేక రకాలుగా మోసపోతున్నారని పేర్కొన్నారు. కేబినెట్ నిర్ణయంతో బీసీలు అన్ని రంగాల్లో ఎదగనున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాదగోని జంగయ్య గౌడ్, పి.బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

### వైద్య శిబిరానికి స్పందన

**ఆమనగల్లు:** ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ సహకారంతో కల్వకుర్తి పట్టణంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేషస్పందన లభిస్తోంది. పది రోజుల కార్యక్రమంలో భాగంగా 8వ రోజు శనివారం 650 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 220 మందికి అద్దాలు పంపిణీ చేశారు. ఇప్పటివరకు 15,500 మందికి కంటి పరీక్షలు చేశారు. 8200 మందికి అద్దాలు పంపిణీ చేశారు. 450 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యుడు శ్రీరాములు, నరేందర్‌గౌడ్, యూసుఫ్ బాబా, గణేశ్, రఘు, యాదయ్య, శ్రీపతి, శేఖర్, రాఘవేందర్, శ్రీను, శివ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

### కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు తగదు

**ఆమనగల్లు:** తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామ కార్యదర్శి అనితపై సస్పెన్షన్ వేటు తగదని బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నెల రోజుల క్రితం పంచాయతీ ట్రాక్టర్‌కు డీజిల్ లేదని, చెత్త సేకరణకు ఆటంకం కలగడంతో.. చందాలు వేసి, రూ.11,500 అందజేశామని గుర్తు చేశారు. ఆ తరువాత పనులు యథావిధిగా జరిగాయని పేర్కొన్నారు. అయినప్పటికీ.. విధుల్లో అలసత్వం చేశారని పేర్కొంటూ ఆమెను సస్పెండ్ చేయడం తగదన్నారు. సస్పెన్షన్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ సర్పంచ్ వెంకటయ్య, నాయకులు రాజు, జంగయ్య, కృష్ణయ్య, శరత్‌చంద్ర శర్మ, రవీందర్, నర్సింహ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా ఆషాఢ ఉత్సవాలు

**తుక్కుగూడ:** మున్సిపల్ పరిధిలోని జెన్నాయిగూడెం శ్రీలక్ష్మినర్సింహాస్వామి ఆలయంలో శనివారం వైభవంగా ఆషాడ మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. అనంతరం సహస్ర కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మురళీశర్మ, అజయ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ తల్లికి పూజలు చేస్తున్న అర్చకులు

# వన మహోత్సవానికి సన్నద్ధం

- లక్ష్యం మేరకు మొక్కలు రెడీ
- ఇప్పటికే స్థలాల గుర్తింపు
- పకడ్బందీగా చేపట్టేందుకు సన్నాహాలు



ఇమామ్‌గూడ అటవీ శాఖ కార్యాలయంలోని నర్సరీ

**తుక్కుగూడ:** పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమానికి అటవీ శాఖ యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ ఏడాది భారీగా మొక్కలు నాటేందుకు ప్రణాళిక చేసింది. ఇందుకు మంఖాల్ ఫారెస్టు రేంజ్ పరిధి మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లోని అటవీ భూములను గుర్తించింది.

**టార్గెట్ 80 వేలు**

మంఖాల్ ఫారెస్టు రేంజ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది 80 వేల మొక్కలను నాటేందుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వర్షాధారిత మొక్కలైన వేప, మద్ది, టేకు, అల్లనేరడు, మామిడి, చింత, కానుగ తదితర మొక్కలను నాటుతున్నారు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలకు 18 వేల మొక్కలను నాటారు. మిగతావాటికి గుర్తించిన ప్రదేశంలో గుంతలు తీసి ఉంచారు. ప్రస్తుతం సరైన వర్షాలు లేని కారణంగా కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. నాటిన మొక్కలకు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.

**30 రకాల మొక్కలు**

వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడానికి తుక్కుగూడ పురపాలిక పరిధి ఇమామ్‌గూడ అటవీశాఖ కార్యాలయంలో నర్సరీని ఏర్పాటు చేశారు. ఇందులో 30 రకాల మొక్కలను పెంచారు. మూడు నెలల క్రితం మొక్కల విత్తనాలను విత్తారు. ప్రస్తుతం మొక్కలు పెరిగి, నాటడానికి సిద్ధంగా ఉన్నాయి.

**త్వరలో లక్ష్యం పూర్తి**

ఈ ఏడాది వన మహోత్సవ లక్ష్యం 80 వేలు. ఇప్పటి వరకు మంఖాల్ ఫారెస్టు రేంజ్ పరిధిలో 18 వేల మొక్కలు నాటాము. ప్రస్తుతం వర్షాలు లేని కారణంగా తాత్కాలికంగా కార్యక్రమాన్ని వాయిదా వేశాం. వానలు కురవగానే మిగతా మొక్కలు నాటుతాం.

– ప్రభాకర్, మంఖాల్ ఫారెస్టు రేంజ్ అధికారి

# పెద్దలను చిన్నపిల్లల్లా చూసుకోవాలి



వృద్ధుల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటున్న ఇన్‌స్పెక్టర్ సుధాకర్

**మహేశ్వరం:** వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చిన్నపిల్లల మాదిరిగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ అన్నారు. ప్రజలతో మమేకం (కమ్యూనిటీ అవుట్ రీచ్)లో భాగంగా ఎర్రకుంట జమాలబండలోని నారీ నికేతన్ వృద్ధాశ్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. వృద్ధులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. వారికి ఆహారం అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత, రక్షణ కల్పించే పోలీసులు వారితో మమేకం కావడం ద్వారా మరింత భరోసా కల్పించినట్లవుతుందని తెలిపారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండడం ద్వారా నేరాలు తగ్గుముఖం పట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎస్.వీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కో లివింగ్ హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలి



ఏసీపీకి ఫిర్యాదు అందజేస్తున్న బీజేపీ నేతలు

**ఇబ్రహీంపట్నం:** కో లివింగ్ హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలని బీజేపీ, బీజేవైఎం నేతలు కోరారు. శనివారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం పట్నం అసెంబ్లీ కన్వీనర్ రవీందర్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మహేందర్‌లు మాట్లాడుతూ.. ఆదిబట్ల పరిధిలో కో లివింగ్ హాస్టళ్లు ఏర్పాటు చేసి, విష సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. దీని వలన అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయని, తద్వారా యువత పెడదారి పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. సంస్కృతి సంప్రదాయాలకు విరుద్ధంగా ఇలాంటి హాస్టళ్లను ఏర్పాటు చేయడం మంచిదికాదని, వాటిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాఘవేంద్ర, బీజేవైఎం ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు వినయ్, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బీరప్ప, జిల్లా కార్యదర్శి విజయ్, జిల్లా అధికార ప్రతినిధి సందీప్, ఐటీసెల్ కన్వీనర్ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

### నూతన నియామకం



భాస్కర్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న వెములయ్యగౌడ్

**అబ్దుల్లాపూర్‌మెట్:** అఖిల భారత గౌడ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జిగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భీమగాని భాస్కర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెములయ్య గౌడ్ శనివారం నియామక పత్రం అందజేశారు. పలు కమిటీలను ఏర్పాటు చేస్తూ.. పేర్లను ప్రకటించారు. సంఘం జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జిగా శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడిగా జంగయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలంగౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన సభ్యులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లేశం గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార స్వామి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షురాలు పద్మజ, యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడు రాములు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



సీఐ గంగాధర్‌కు సీసీ కెమెరాలు అందజేస్తున్న పాస్టర్లు

**కడ్తాల్:** సామాజిక సేవలో భాగంగా నిఘా పటిష్టత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ గంగాధర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆడోనైడ్ కృపా ప్రార్థన మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చర్చి పాస్టర్, సభ్యులు మూడు సీసీ కెమెరాలను సీఐకి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేర నియంత్రణకు కెమెరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం దాతలను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రశేఖర్, పాస్టర్స్ డేవిడ్, ప్రసాద్, కానిస్టేబుల్ శ్యాంసన్ ఉన్నారు.

# రోడ్డు విస్తరణకు సహకరించాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- అధికారులతో కలిసి నాదర్‌గుల్ రోడ్డు పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

**బడంగ్‌పేట్:** ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడి రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నాదర్‌గుల్ రోడ్డు విస్తరణ పనులకు పార్టీలకతీతంగా నాయకులు సహకరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి కోరారు. శనివారం గాంధీనగర్ టూ నాదర్‌గుల్ రోడ్డు విస్తరణ పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాదర్‌గుల్ రోడ్డు విస్తరణకు గతంలో హెచ్‌ఎండీఏ నిధుల నుంచి రూ.9కోట్లు మంజూరు చేయించానని స్పష్టం చేశారు. అల్మాస్‌గూడ, లెనిన్‌నగర్ ఇతర లింక్ రోడ్లను విస్తరణ చేశామన్నారు. రోడ్డు మధ్యలో సింగిల్ డివైడర్‌ను ఏర్పాటు చేశామన్నారు. నాదర్‌గుల్ రోడ్డు రెండేళ్లుగా రోడ్డు విస్తరణ పనులకు అనేక అడ్డంకులు వచ్చాయని, ఇప్పుడు అన్ని తొలగిపోయి విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. రోడ్డుకు ఇరువైపులా 75 చెట్లను గుర్తించి నంబరింగ్ వేశామని వెల్లడించారు. గుర్తించిన చెట్లను ఫారెస్ట్ అధికారులకు తెలుపగా వారు వచ్చి వారంలో చెట్లను షిఫ్ట్ చేస్తారన్నారు. అలాగే ఇరువైపులా విస్తరణకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు సంబంధిత అధికారులకు రూ.52లక్షల చెక్కును అందిస్తున్నామన్నారు. విస్తరణలో భాగంగా ఒకవైపు డ్రైనేజీ ఉందని, పెద్ద డ్రైనేజీ సిమెంట్ పైపులు వేసేందుకు అదనంగా మరో రూ.50 లక్షలు మంజూరి చేశామన్నారు. సెంట్రల్ లైటింగ్ సిస్టం కూడా ఉందని, సింగిల్ డివైడర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తామన్నారు. నీరు నిల్వ ఉండకుండా బోనాల పండుగకు అటు ఇటుగా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. ప్రతి ఒక్కరూ రాజకీయాలకతీతంగా సహకరించాలన్నారు. ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న ప్రజల బాధలు అర్థం చేసుకొని రోడ్డు విస్తరణను రాజకీయం చేయకుండా నాదర్‌గుల్ గ్రామస్తులు అందరూ సహకరించి పనులు త్వరగా పూర్తి చేసేలా చూసే బాధ్యత అందరిదన్నారు. డీఈఈ వెంకన్న, విద్యుత్ డీఈఈ శ్రీనివాస్, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

# ఆషాఢం.. తల్లికి ఇష్టమైన మాసం

- ఊరూరా బోనాల సంబురాలు
- నైవేద్యంగా మహంకాళికి సమర్పణ



మహంకాళి అలయం (ఇన్‌సెట్లో) అమ్మవారు



**ఇబ్రహీంపట్నం:** ఆషాఢం మహంకాళి మాతకు ఇష్టమైన మాసం. గ్రామాలు, పొలిమేరల్లో తల్లికి బోనాలు సమర్పించే పర్వదినాల మాసం. అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈ నెలలో దుర్గమ్మను పూజిస్తే ఆయురారోగ్య, అష్టైశ్వర్యాలను ప్రసాదిస్తుందని ప్రజల విశ్వాసం. బోనాల పండుగ పేరుతో కాళికామాతను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. నైవేద్యంగా బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. పురాతన ఆచార, సంప్రదాయలతో పాటు, శాస్త్రీయతకు బోనాలు అద్దం పడతాయి. మహిళలు కాళ్లకు పసుపు రాసుకొని, ఇంటి గుమ్మానికి అలంకరణగా వేపాకులు కట్టడం వలన క్రిమీ కీటకాలు వృద్ధి చెందవని, వ్యాధులు రావనే నమ్మకం. మహిళలు నూతన వస్త్రాలు ధరించి, బోనం (ఉడకబెట్టిన అన్నం, బెల్లం, పెరుగుతో తయారు చేసిన నైవేద్యం. ఆపై వేపాకులు ఉంచి వాటిపై మట్టి ముంతను పెడతారు. దానిపై ఉన్న మట్టి ముంతలో నూనే పోసి దీపం వెలిగిస్తారు.) కుండను తలపై పెట్టుకొని ఊరేగింపుగా డప్పు చప్పుళ్ల నడుమ పోతు రాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో అమ్మవారి సన్నిధికి చేరుకుంటారు. నైవేద్యంగా బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. అమ్మవారి తొట్టెల ఊరేగింపు ఎంతగానో ఆకట్టుకుంటుంది.

**నేడు బోనాలు**

ఇబ్రహీంపట్నం, ఎల్మినేడు, రాయపోల్ గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగ జరగనుంది. ఈ మాసంలో మహంకాళి, శ్రావణంలో పోచమ్మ బోనాల ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని మహంకాళి అమ్మవారికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి, ఒడి బియ్యాన్ని సమర్పించారు. అనంతరం అన్నప్రసాద దానం చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నైవేద్యంగా బోనం సమర్పిస్తారు. సోమవారం అమ్మవారి ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయి.